క్లుప్తంగా

ఆధునికీకరించిన ఎలక్షన్ సెల్ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్‌లోని ఆధునీక రించిన ఎలక్షన్ సెల్ భవనాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ప్రారంభించారు. గతంలో బాగా దెబ్బతిన్న ఈ సెల్ భవనాన్ని రూ.7 లక్షలతో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆధునికీకరించింది.ఇటీవల పనులు పూర్తి కావడంతో సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో దెబ్బతిన్న ప్రతి భవనాన్ని ఆధునికీకరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరోవైపు ఉద్యోగులు తమ తమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ జేడీ అప్పలకొండ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీఎస్ఓ ఆచార్యులు, ఎలక్షన్ సెల్ డీటీ మురళీ పాల్గొన్నారు.

సురక్షిత గర్భస్రావాలపై వైద్యులకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): సురక్షిత గర్భస్రావాలపై పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. సెప్టిక్ అబార్షన్ వల్ల జరిగే మాతృ మరణాలను అరికట్టేందుకు, వైద్యాధికారుల నైపుణ్యత పెంచేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణలో ఎంటీపీ యాక్ట్ గురించి, సురక్షిత గర్భస్రావాలు చేసేందుకు అవసరమైన మందులు, పరికరాలు, వసతుల ఏర్పాటు గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి గైనకాలజి హెచ్ఓడీ డాక్టర్ ఎస్. మాణిక్యరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుగుణశ్రీ, డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా శేరే సురేష్

కర్నూలు కల్చరల్: కర్నూలు నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శేరే సురేష్ వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ వారు గత రెండు రోజులుగా నిర్వహించిన సర్టిఫికెట్ ట్రైనర్ వర్క్‌షాప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో ఫౌండేషన్ కోఆర్డినేటర్స్ నక్కా నవీన్, లగిశెట్టి మహేష్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా ఎంపిక చేసి సర్టిఫికెట్ అందజేశారు. సురేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తానన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సిటీ ప్లానర్

కర్నూలు (టౌన్) : విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ నుంచి కర్నూలు నగరపాలకకు బదిలీపై వచ్చిన సిటీ ప్లానర్ వి. మీనాకుమారి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సిటీ ప్లానర్‌ను డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అండగా ఉంటుందని కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని టెలికాం నగర్‌లో 51, 52, 53వ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించి బీమా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచి పనులను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించుకొని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ కార్యదర్శి లలితకు నివాళి



లలిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లావాసి, విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. మద్దికెర మండలం పెరవళికి చెందిన ఈమె 1994లో గ్రేడ్ వన్ గ్రంథాలయ అధికారిగా ఆదోని శాఖ గ్రంథాలయంలో ఉద్యోగంలో చేరారు. 2008 నుంచి 2016 వరకు కర్నూలు జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా పని చేశారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఏర్పాటు చేసిన సంతాప సభలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్‌చంద్రబోస్, మాజీ చైర్మన్ చంద్రశేఖర కల్కూర, కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క ఆమె చిత్రపటానికి పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్లు గోవిందరెడ్డి, బాష, నజీమాబీ, రేణుక, శ్రీనివాస్, ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.



పాతబస్టాండ్ సమీపంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రాఖీ సందడి

రక్షాబంధన్ సందడి మొదలైంది. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే వేడుక కావడంతో నగరంలోని పాత బస్టాండ్, పూలబజార్, చిన్నమ్మ వారిశాల వీధి, వన్‌టౌన్ ప్రాంతాల్లో వివిధ రకాల రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. యువతులు ఉత్సాహంగా వాటిని కొనుగోలు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



విక్రయానికి వివిధ రకాల రాఖీలు



కొనుగోలు చేస్తున్న దృశ్యం



'మాతృభాష' సేవకులు

- తెలుగు సాహిత్యంలో విశేష సేవా కృషికి గుర్తింపు
- అధికార భాషా సంఘం 'గిడుగు' పురస్కారానికి ఎంపికైన హరికిషన్
- ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ 'హంస' పురస్కారానికి ఎంపికైన అజీజ్
- నేడు మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రదానం



హరికిషన్ కుటుంబ సభ్యులు,



డాక్టర్ ఇస్మాయిల్ స్ఫూర్తి పురస్కారం అందుకుంటున్న అజీజ్ (ఫైల్)

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కనబరుస్తూ సాహితీ సేవ చేస్తున్న ఇరువురు జిల్లా సాహితీ వేత్తలకు రాష్ట్ర స్థాయి తెలుగు పురస్కారాలు వరించాయి. వీరిలో ఒకరు తెలుగు బాల సాహిత్యంలో ఒక నూతన ఒరవడిని సృష్టించి పిల్లలు మాట్లాడుకునే భాషలో అత్యంత సరళంగా కథలు రాయడంలో సిద్ధ హస్తుడు. మరొకరు దాదాపు నాలుగు దశాబ్దాలుగా సాహిత్య రచన చేస్తూ చారిత్రక పరిశోధన చేస్తున్నారు. స్టేజి నాటకాలు, రేడియో నాటకాలు, చారిత్రక నవలలు, పరిశోధన గ్రంథాలు వెలుగులోకి తెస్తూ భాషా సేవ చేస్తున్నారు. ఇందుకు గుర్తింపుగా రాష్ట్ర అధికార భాషా సంఘం బాల సాహితీ వేత్త డాక్టర్ ఎం. హరికిషన్ 'గిడుగు' వేంకట రామమూర్తి సాహిత్య పురస్కారానికి, నవలా రచయిత ఎస్.డి.వి అజీజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ 'హంస' పుస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజయవాడ, రాజమండ్రిలో జరిగే భాషా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర స్థాయి సాహిత్య పుస్కారాలను అతిథుల చేతుల మీదుగా స్వీకరించనున్నారు.

బాల సాహిత్య రచనలో మేటి హరికిషన్

పాణ్యానికి చెందిన హుసేనయ్య, కృష్ణవేణమ్మ దంపతుల కుమారుడు హరికిషన్. కర్నూలులో స్థిరపడిన ఈయన ప్రస్తుతం కోడుమూరు మండలం అమడగుంట్లలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న సమయంలో తన అధ్యాపకుడు కథా రచయిత అయిన డాక్టర్ తుమ్మల ఆమకృష్ణ సాహచర్యంతో సాహిత్య రచన పట్ల ఆసక్తి పెంపొందించుకున్నాడు. 'కేతు విశ్వనాథ రెడ్డి కథలు – సామాజిక దర్శనం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. పలు సాహితీ సంస్థల సభ్యుడిగా ఉంటూ సాహిత్య రచనలకు తోడ్పడుతున్నారు. తనకు 'గిడుగు' సాహిత్య పురస్కారం రావడం సంతోషంగా ఉందని పిల్లల్లో మార్పు తీసుకొచ్చే కథలు రాయడం, అంతరించి పోతున్న సాహితీ ప్రక్రియలను వెలికి తీసి రచనలు చేసేందుకు కృషి చేస్తున్నానని హరికిషన్ పేర్కొంటున్నాడు.

చారిత్రక నవల రచనలో దిట్ట అజీజ్

కర్నూలు బుధవార పేటకు చెందిన ఎస్.అబ్దుల్ అజీజ్ ఎస్.డి.వి. అజీజ్ అనే కలం పేరుతో రచనలు చేస్తున్నారు. 1964లో జన్మించిన ఈయన తన 14వ సంవత్సరం నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. 40 దశాబ్దాలకు పైగా సాహిత్య రచనలు చేస్తూ చారిత్రక విషయాలను వెలుగులోకి తెచ్చారు. స్టేజి నాటకాలు, సీరియల్స్, చారిత్రక నవలలు, పరిశోధన గ్రంథాలు, సాంఘిక నవలలు, కథా సంపుటాలు వెలువరించారు. అనేక సాహితీ సంస్థల్లో సభ్యుడిగా ఉంటూ సాహితీ సేవ చేస్తున్నారు. సాహితీ మాస పత్రికకు ఎడిటర్‌గా పనిచేసిన ఈయన ఇప్పటికే కందుకూరి పురస్కారం, తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం, హీరాలాల్ స్మారక సాహితీ పురస్కారం, లలితా కళా సమితి ప్రతిభా పురస్కారం, డాక్టర్ ఇస్మాయిల్ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. తాజాగా 'హంస' పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని అజీజ్ అన్నారు. అనేక చారిత్రక ఘట్టాలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు పరిశోధనలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

ప్రతి గడపలో సంతోషం



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య

- అర్హులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం నెలకొందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన మేయర్ బీవై రామయ్యతో కలిసి స్థానిక 52, 46వ వార్డుల్లో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్. నగప్ప వీధి, అశోక్ నగర్, పాల కొట్టాల ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశించారు. పేదల బతుకుల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. వీటిని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత ఉన్న ప్రతి గడపకు చేర్చామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాసు, పార్టీ నాయకులు యూసుఫ్, మల్లి, హసీనా, సర్దార్, మహేష్, రమణ, ఇబ్రు, మునిస్వామి, సుబ్బు, చిన్ని, సిద్దయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

కల్లూరు : కర్నూలు నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి మేయర్ క్యాంపు కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులతో వార్డుల సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో పాలకవర్గం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు దుర్మార్గుడు

- విద్యుత్ ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపించారు
- వామపక్ష పార్టీల నాయకులు



విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): 2000వ సంవత్సరంలో ఉమ్మడి ఏపీలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని పోరాటం చేస్తున్న ఉద్యమకారులపై చంద్రబాబునాయుడు పాశవికంగా కాల్పులు జరిపించి ముగ్గురు ప్రాణాలను బలిగొన్న దుర్మార్గుడని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాముల చిత్రపటాలకు సోమవారం రాజ్‌విహార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.మునెప్ప, కె.జగన్నాథం, సీపీఎం నాయకులు పీఎస్ రాధాకృష్ణ, కేవీ నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..2000వ సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు సంస్కరణలు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అప్పటి ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండి అణచి వేశారన్నారు. ముగ్గురు ప్రాణాలను తీసుకోవడమే కాక అనేక మందిని గాయాలపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, టి.రాముడు పాల్గొన్నారు.

సంక్షిప్తం

భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని గౌరీ శంకర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల విశేష లఘున్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకారం, అర్చనలు తదితర పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : ఈపీఎఫ్ పెన్షనర్లకు నెలకు కనీసం రూ.9 వేలు పెన్షన్‌గా ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.మోహన్,శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత ఇన్సూరెన్స్‌తోపాటు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. రైల్వే చార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సుధాకరప్ప ఇబ్రహీం,సూర్యనారాయణ, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

హమాలీ ఆత్మహత్య

కర్నూలు : కర్నూలు పాతబస్తీ మించిన్ బజార్‌లో నివాసముంటున్న ఉదయ్ కిరణ్ (31) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా ఆర్థిక పరిస్థితులు బాగలేక తీవ్ర ఒత్తిడికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్దిసేపు తర్వాత కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య స్వరూపారాణితో పాటు ఇద్దరు సంతానం. తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను సత్కరిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు (టౌన్) : జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. లక్ష్మీప్రతాప్, ప్రదీప్ నాయక్ వచ్చే నెల 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు శ్రీనగర్‌లో నిర్వహించే 52 వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికయిన ఇరువురు క్రీడాకారులను సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సీఈఓ రమణ శాలువా కప్పి సన్మానించారు. క్రీడాకారులకు న్యాయవాది శ్రీధర్ రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి పాల్గొన్నారు.

అంతర్ పాఠశాలల క్రీడా విజేతలు వీరే

కర్నూలు (టౌన్) : జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడా విజేతలను అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ బాషా, అధ్యక్షుడు రామాంజనేయలు సోమవారం ప్రకటించారు. విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బహుమతులు, కప్‌లు, మెడల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. హాకీ క్రీడాంశంలో బాలుర విభాగంలో మాంటిస్సోరి విద్యానగర్ , మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్లు మొదటి, రెండు స్థానాలు దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో జొహరాపురం జెడ్పీ హెచ్ఎస్ స్కూల్ , మాంటిస్సోరి ఏ క్యాంపు స్కూల్, ఫుట్‌బాల్ బాలుర విభాగంలో రిడ్జ్‌స్కూల్, బి. క్యాంప్ బాలుర పాఠశాల, బాలికల విభాగంలో అతినా స్కూల్, శ్రీ లక్ష్మీ ఇంగ్లిషు మీడియం స్కూల్, బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో బాలుర జట్టు అతినా స్కూల్, ప్రజ్ఞా స్కూల్, వాలీబాల్ బాలుర విభాగంలో ఇండస్ స్కూల్, మున్సిపల్ హైస్కూల్, బాలికల విభాగంలో మాంటిస్సోరి ఏ. క్యాంపు, శ్రీ లక్ష్మీ, రగ్బీ అండర్-11 బాలుర విభాగంలో ఎస్టీ ఆశ్రమ పాఠశాల, ఆదర్శ విద్యా మందిర్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

2న జిల్లా స్థాయి యోగాసన జట్ల ఎంపికలు

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 2 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి యోగాసన జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగాసన అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలను 9-14, 14-18, 18-28,28-35, 35-45, 45-55 వయస్సు విభాగాల్లో బాల బాలికలు, స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.20 చెల్లించాలని తెలిపారు. వివరాలకు 9949257657 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్నూకర్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్): ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న స్నూకర్ క్రీడాంశంలో రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయలు అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని క్యూలైన్ స్నూకర్స్ అకాడమీలో స్నూకర్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడా ప్రతినిధులు చిన్న సుంకన్న, మునిరంగ, మన్సూర్ బాషా పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల్లో అరుదైన కణితి

- ప్రకాశం జిల్లా వాసికి ఆరోగ్యశ్రీలో తొలగింపు



కోలుకున్న గోరియా నాయక్‌తో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



తొలగించిన కణితి

కర్నూలు (హాస్పిటల్): ప్రకాశం జిల్లా వాసికి ఊపిరితిత్తుల్లో ఏర్పడ్డ అరుదైన కణితిని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ ద్వారా తొలగించారు. వివరాలను ఆసుపత్రి కార్డియోథొరాసిక్ హెచ్ఓడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ప్రకాశం జిల్లా మాచర్లకు చెందిన గోరియా నాయక్(57) మిర్చీ రైతుగా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు కొంతకాలంగా ఆయాసం, దగ్గు, ఛాతీలో పట్టేసినట్లు ఉండటంతో స్థానిక వైద్యులకు చూపించగా ఎక్స్‌రే తీసి ఛాతీలో కణితి ఉన్నట్లు గుర్తించి గుంటూరుకు రెఫర్ చేశారు. గుంటూరులోని పలు ఆసుపత్రులు తిరిగిన ఆయనకు అక్కడి వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించి సమస్య ప్రమాదకరంగా ఉందని, హైదరాబాదు వెళ్లాలని సూచించారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని తేల్చారు. అప్పటికే రూ.లక్షన్నర ఖర్చు చేసిన ఆయన మళ్లీ ఖర్చు చేసే శక్తి లేక స్వగ్రామానికి వెనుదిరిగాడు. తెలిసినవారి సూచన మేరకు వారం క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని గుండె శస్త్రచికిత్స విభాగానికి వచ్చి వైద్యులను కలిశాడు. రిపోర్టులను పరిశీలించిన అనంతరం ఆయనకు ఊపిరితిత్తులపైన ఉన్న పొర నుంచి కిందకు కణితి ఏర్పడిందని నిర్ధారించుకుని ఈనెల 25వ తేదీన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రలతో కలసి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆపరేషన్ ద్వారా కణితిని తొలగించారు. ఈ కణితి 350 గ్రాముల బరువు ఉందని, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- స్పందన కార్యక్రమంలో కమిషనర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై నగర ప్రజలు కమిషనర్‌ను కలిసి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.నగరపాలక మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వే శ్వర రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు పాల్గొన్నారు.

గర్భస్త లింగనిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భస్త లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యానేరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పీసీ పీఎన్‌డీటీ కర్నూలు డివిజన్ చైర్‌పర్సన్ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్స్ కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రామ్ ఆఫీసర్లు తనిఖీ చేసి వారి పత్రాలు అన్నీ సరిగ్గా ఉంటే వాటి ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి తదుపరి ఆమోదం కోసం సమర్పిస్తారన్నారు. సమావేశంలో పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, గైనకాలజిస్టు డాక్టర్ నర్మద, డెమో ప్రమీలాదేవి, ఏపీపీ సుబ్బయ్య, ఎన్‌జీఓ రాయపాటి శ్రీనివాసులు, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డీపీహెచ్ఎన్‌వో మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

సీ క్యాంపు రైతుబజారుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతు బజారును శుభ్రం పరచడం కోసం ఈ నెల 29న సెలవు ప్రకటించినట్లు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

డయల్ యువర్ డీఎం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని 1, 2 డిపోల బస్సులు తిరిగే పట్టణాలు, ప్రాంతాల ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని చెప్పారు.రెండు డి పో ల పరిధిలోని ప్ర యా ణికులుఉద యం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో 99592 25794 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కవన విజయం సాహిత్య సభ

కర్నూలు కల్చరల్: గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు కవులతో కవన విజయం సాహిత్య సభ ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా తెలిపారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా స్పెషలాఫీసర్ ప్రద్యుమ్న పర్యటన

కర్నూలు(సెంట్రల్): రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా స్పెషలాఫీసర్ ప్రద్యుమ్న మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు సీపీఓ అప్పలకొండ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన గోనెగొండ్ల మండలంలో ఏదైనా సచివాలయానిన ఆకస్మికంగా తనిఖీ చేస్తారని, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాన్ని సందర్శిస్తారని వివరించారు.